క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న తహసీల్దార్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు

వెల్దుర్తి: రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర ఉత్తమ బీఎల్‌ఓగా విజయవాడలో సీఎస్ నుంచి అవార్డు అందుకున్న ఎల్ నగరం వీఆర్‌ఓ కృష్ణమూర్తిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు కృష్ణమూర్తికి పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. గత ఎన్నికల సందర్భంగా నూతన పోలింగ్ బూత్ ఏర్పాటు, అక్కడ అధిక శాతం ఓటు నమోదులో కృష్ణమూర్తి చూపిన నిబద్ధతను తహసీల్దార్ ప్రశంసించారు.

రంగనాథస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి దంపతులు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామిని కర్నూలు సబ్ జడ్జి బి.లీలావెంకటశేషాద్రి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు రంగస్వామి జడ్జికి శాలువా కప్పి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వచనం పలికారు.

కూరగాయల మార్కెట్ పరిశీలన



మార్కెట్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు

మద్దికెర : స్థానిక ప్రధాన కూడలిలో నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు గురువారం పరిశీలించారు. మార్కెట్ స్థలం, నిర్మాణం, నిధులు, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కాయగూరలు ఎక్కడి నుంచి వస్తున్నాయని, రైతులు ఎంతమంది సొంతంగా విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారని వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి మార్కెట్లు దేవనకొండతో పాటు మరికొన్ని గ్రామాల్లో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పత్తికొండ ఉద్యానవన అధికారి దస్తగిరి, వీహెచ్‌ఏ కవిత నున్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే–44పై రైల్వే స్టేషన్ ఎదురుగానున్న ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. డోన్‌కు చెందిన హుసేన్, వినోద్ బైక్‌పై కర్నూలుకు వస్తూండగా సంఘటనా స్థలంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనాస్థలికి చేరుకున్న హైవే పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తుగ్గలి : పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు వైద్యాధికారిణి ప్రణీత అన్నారు. గురువారం తుగ్గలిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి గేదెలకు వైద్య పరీక్షలు చేశారు. పశువులు, గొర్రెలు, మేకలకు బొబ్బరోగం, నట్టల నివారణ మందులను తాగించారు. గర్భకోశ వ్యాధులు కలిగిన పశువులను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చిప్పగిరి:మండలంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు, రైతులు సద్వినియోగం చేసికోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ప్రసన్న బాయి సూచించారు. గురువారం మండలంలోని నేమకల్లు, ఏరూరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు,ఎద్దులకు,పలు టీకాలు వేశారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

తుగ్గలి : పంట రుణాలు తీసుకున్న రైతులు గడువులోపు రెన్యూవల్ చేసుకోవాలని మారెళ్ల ఆశోక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ ఆశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సహకార బ్యాంకులో తీసుకున్న రుణాలు మార్చి 25వ తేదీలోగా చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. లేకపోతే వడ్డీ రాయితీ కోల్పోవడంతో పాటు, అపరాధ వడ్డీ చెల్లించాల్సి వస్తుందని చెప్పారు.

దుకాణాల అద్దెలో రాయితీ ఇవ్వండి

ఆలూరు: స్థానిక సంతమార్కెట్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు పూర్తిస్థాయిలో జరిగే వరకు అద్దెలో 30 శాతం రాయితీ ఇవ్వాలని వ్యాపారులు కోరారు. గురువారం గ్రామ పంచాయతీ ఈఓ వై.ప్రభాకర్‌కు వినితి పత్రం అందజేశారు. వ్యాపారులు షబ్బీర్ బాషా, చాంద్ బాషా, రవీంద్రరావు, భీమన్నగౌడు రామ్మోహన్, జయరాముడు విలేకరులతో మాట్లాడారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షెక్షావలి, షాషావలి దర్గాలను గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. రెండు దర్గాల్లో నైవేద్యం సమర్పించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాలతో పాటు సాయిబాబా మందిరంలో భక్తులు పూజలు చేశారు.

వర్షాధార వ్యవసాయం.. ఏటా ప్రకృతి చేతిలో రైతులు, కూలీలు ఓడిపోతూనే ఉన్నారు. దీంతో పంటలు పండక.. జీవనం సాగక.. దశాబ్దాలుగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు ఉపాధి వెతుక్కుంటూ వెళ్తున్నారు. వారు.. నవంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పత్తి కోత పనులు, జనవరి రెండో వారం నుంచి గుంటూరు జిల్లాలో మొదలయ్యే మిర్చి కోతలకు వలస వెళ్తున్నారు.

పశ్చిమ ప్రాంతం.. వలస జీవితం!



వలస వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అంజినమ్మ, ఉరుకుంద దంపతులది ఐనకల్లు గ్రామం. 'మేం గుంటూరు సమీపంలోని పలు ప్రాంతాల్లో మిర్చి కోతలకు వలస వెళ్తున్నాం. తాము వెళ్తే ఇక్కడ తమ కుమారుడు శివను చూసుకునే వారు లేరు. దీంతో తమతో పాటు పనులకు తీసుకెళ్తున్నాం. శివ ప్రస్తుతం ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. మక్కూడా చదివించాలని ఉంది. కానీ వీలుకాని పరిస్థితుల్లో తీసుకెళ్తాన్నా'మంటున్నారు.

- స్థానికంగా లభించని ఉపాధి
- ఆలూరు నియోజకవర్గం నుంచి ఏటా కూలీల వలసలు
- మొన్నటి వరకు పత్తి కోతలకు తెలంగాణకు పయనం
- నేడు మిర్చి కోతలకు గుంటూరు జిల్లాకు..
- పనుల కోసం ఊరూరూ తిరుగుతున్న జనం
- పట్టించుకోని ప్రభుత్వం



గుంటూరు జిల్లా గార్లపాడు సమీపంలోని పొలంలో గుడిసెలు వేసుకొని తెల్లవారుజామునే వంట వండుతున్న ఐనకల్లు గ్రామ కూలీలు

ఆస్పరి: పాలకుల హామీలకే పరిమితమవుతున్నారు.. వలసలతో పల్లెలు ఖాళీ అవుతున్నాయి.. పనులు లేక వ్యవసాయ కూలీలు బతుకు తెరువు కోసం వలస బాట పట్టినా.. మిగిలిన ఆ కొంత మంది కూడా వెళ్లిపోతున్నా..ఉపాధి పనులు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. గుంటూరు జిల్లాలో మిర్చి కోతలకు వెళ్లిన కూలీలు.. యజమాని పొలాల్లోనే గుడిసెలు వేసుకుని చలికి పిల్లా పాపలతో ఇబ్బందులు పడుతూ పనులకు వెళ్తున్నారు. ఒక కిలో మిర్చి కోస్తే రూ.7 లు ఇస్తున్నారని కూలీలు చెబుతున్నారు. ఆస్పరి మండలంలోని ఆస్పరి, ఐనకల్లు, యాటకల్లు, తురువగల్లు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కారుమంచి, ములుగుందం, బనవనూరు, పుటకలమర్రి, అట్టికల్లు గ్రామాల నుంచి గుంటూరులో మర్చి పొలాల్లో పని చేయడానికి వేలాది మంది వలస వెళ్లారు. రబీ పప్పు శనగ కోతలు ముగియడంతో పనులు దొరకడం లేదని అందుకే వలసలు వెళ్తున్నామని చెబుతున్నారు.

వర్షమే ఆధారం..

ఆలూరు నియోజకవర్గంలో ఆలూరు, హొళగుంద, చిప్పగిరి, హలహర్వి మండలాలకు హెచ్ఎల్సీ, ఎల్లెల్సీ నుంచి సాగు నీరు వస్తుండగా, దేవనకొండకు హంద్రీ నీవా ద్వారా సాగు నీరు అందుతుంది. ఆస్పరి మండలానికి ఎలాంటి నీటి వనరులు లేవు. దీంతో రైతులు వరుణదేవుడిపై భారం వేసి పంటలు సాగు చేస్తారు. అయితే ఏటా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. హంద్రీ నీవా ద్వారా తాగు, సాగు నీరు అందించాలని మండలంలోని రైతులు కోరుతున్నప్పటికీ ఏళ్ల గడచినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు.

మా గ్రామం నుంచి 200 మంది వచ్చాం



మా గ్రామం నుంచి 200 మంది కూలీలు గుంటూరు జిల్లా గార్లపాడు గ్రామానికి వచ్చాం. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు వెళ్లి సాయంత్రం 5.30 గంటలకు వస్తాం. మిర్చి కోత కోస్తే కిలోకు రూ.7 ప్రకారం ఇస్తున్నారు. ప్రతి రోజూ ఒక్కొక్కరు 70–80 కిలోల దాక మిర్చి కోత కోస్తాం. మేం యజమాని పొలాల్లోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నాం. చలి భరించలేనంతగా ఉన్నప్పటికీ తప్పని పరిస్థితి. ఇక్కడ రెండు నెలలు పాటు కూలీ దొరుకుతుంది. – సుధాకర్, యాటకల్లు గ్రామం

వలస వెళ్లక తప్పడం లేదు



ఏటా రెండు సార్లు వలస వెళ్లక తప్పడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవాలంటే ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లక తప్పడం లేదు. గుంటూరులో మిర్చి కోతలకు వెళ్తున్నాం. ఇక్కడ వ్యవసాయ పనులు లేకపోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో వలస వెళ్తున్నాం. ఉపాధి పనుల గురించి మాట్లాడలేం.

– పార్వతి ఐనకల్లు గ్రామం, ఆస్పరి మండలం

అడిగిన వెంటనే పనులు కల్పిస్తాం

గ్రామాల్లో అడిగిన వెంటనే కూలీలకు పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం. కూలీల వేతనాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. కూలీలు వలస వెళ్లొద్దని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో ప్రతి రోజు 3,800 మంది కూలీలు రావాల్సి ఉండగా ప్రస్తుతం రోజుకు 2,600 మంది పనులకు వస్తున్నారు.

– రామకృష్ణ, ఏపీఓ, ఆస్పరి



పొలంలోనే గుడిసెలు వేసుకున్న యాటకల్లుకు చెందిన కూలీలు



గుంటూరు వద్దనున్న పొలాల్లో మిర్చి కోత పనులు చేస్తున్న బిల్లేకల్లుకు చెందిన కూలీలు





వలస వెళ్లేందుకు మినీ వ్యాన్, లారీలో సామగ్రి సర్దుతున్న ఖైరుప్పల, ఐనకల్లు వాసులు

పత్తికొండ సబ్‌జైలు తనిఖీ

పత్తికొండ రూరల్ : పట్టణంలోని సబ్‌జైలును కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌జైల్లో ఉన్న వసతుల గురించి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకునిరావాలని కోరారు. అనంతరం ఖైదీల గదులు, వంటశాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతు కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాలని జైల్ సిబ్బందికి సూచించారు. పత్తికొండ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మన్న, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వెంకటేష్, న్యాయవాది నాగరాజు, కోర్టు సిబ్బంది రాఘవేంద్ర, ప్రసాద్ ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసలందుకున్న పత్తికొండ డిగ్రీకళాశాల విద్యార్థులు

పత్తికొండ రూరల్: గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ అటానమస్ కళాశాలలో వికసిత్ భారత్–2047 అనే అంశంపై గురువారం జరిగిన జాతీయ సదస్సులో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రసంగించి, ప్రశంసలు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి, వైస్ ప్రిన్సిపాల్ జి.పవన్‌కుమార్ మాట్లాడుతూ.. కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.శివప్రసాద్ సాంకేతిక పరిజ్ఞానంపై తన ప్రసంగాన్ని వినిపించి నిర్వాహకులను మెప్పించారన్నారు. అలాగే.. బోటనీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లత వ్యవసాయ రంగంలో నెలకొన్న సవాళ్లను,బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి.శ్రావణి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అపరిష్కృత సమస్యల పరిష్కారంపై అద్భుతంగా ప్రసంగించారని అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆంగ్ల అధ్యాపకులు పి.శ్రీనివాసరావు, హనుమంతరెడ్డిని ప్రిన్సిపాల్ మాధురి అభినందించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

హాలహర్వి: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని డీఎల్‌డీఓ అనురాధ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..మండలానికి ఉపాధి హామీ నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగునీరు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఎంపీడీఓ వరలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అనురాధ

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

చిప్పగిరి:కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై మండలంలోని నంచర్ల గ్రామంలో గురువారం మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జాన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలతో పాటు స్పర్శ కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : మండలంలోని చక్రాళ్ల గ్రామంలో మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్టువ్యాధి నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వ్యాధి నిర్మూలనపై పంచాయతీ సెక్రెటరీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యారోగ్యసిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు రవికుమార్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అహింస, సత్యం గాంధీజీ ఆయుధాలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్యదర్శులు

మద్దికెర : మహాత్మగాంధీ అహింస, సత్యం అనే ఆయుధాలు ఉపయోగించి బ్రిటీష్ వారిని గడగడలాడించారని కార్యదర్శి శివకుమార్, బండారి ఆంజనేయులు అన్నారు. గురువారం గాంధీజీ వర్ధంతా సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలోనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ కార్యదర్శులు కరుణకుమారి, రేణుక, పంచాయతీ సిబ్బంది విజయ్, ప్రదీప్, రామాంజనేయులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామ ఎంపీపీ పాఠశాలలో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయుడు కె.అయ్యనగౌడ్, కేర్ టేకర్ జమదగ్ని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

పదవీ విరమణకు వెళ్లి.. అనంత లోకాలకు



కుసూరు చంద్రన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన కుసూరు చంద్రన్న (64) తన సన్నిహితుడైన ఉపాధ్యాయుడు గుండ్లకొండ గ్రామంలో గురువారం పదవీ విరమణ చేస్తుండటంతో అక్కడికి వెళ్లాడు. అయితే ఒక్కసారిగా గుండెలో నొప్పి అంటూ కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సూపర్ సిక్స్ కాదు.. సూపర్ జీరో

- అరచేతిలో వైకుంఠం చూపి ప్రజలను వంచించారు
- చంద్రబాబు మోసంపై విరుచుకుపడిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాడతామని వెల్లడి



సూపర్‌సిక్స్ మేనిఫెస్టో చూపుతూ విమర్శిస్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఓడించలేనని చంద్రబాబు నాయుడు..జనసేన, బీజేపీతో కూటమిగా మారి, గెలుపు కోసం బూటకపు, అమలు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలకు నాడు అరచేతిలో వైకుంఠం చూపి గెలుపొందారని, అయితే నాడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సాకులు వల్లెవేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా సూపర్ జీరోగా మార్చారని ఎద్దేవా చేశారు. గురువారం కర్నూలులోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాడు చంద్రబాబు ఇచ్చిన హామీల సూపర్ సిక్స్ మేనిఫెస్టో పత్రం చూపుతూ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు నెలకు రూ.1500, 20లక్షల ఉద్యోగాల కల్పన అమలు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. జగనన్న సీఎంగా ఉన్నపుడు ఖజానా ఖాళీగా ఉన్నా, కరోనా విపత్కర పరిస్థితులున్నా తానిచ్చిన హామీలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని, మరింత సంక్షేమం అందిస్తానని చెప్పి..నేడు మాత్రం. ఖజానా ఖాళీగా ఉందని, డబ్బులు పోగయ్యాక.. పథకాల గురించి చూద్దామంటూ కబుర్లు చెప్పి మరోసారి తన మోసపూరిత నైజాన్ని బయటపెట్టారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వాన్ని ప్రజల తరఫున వెంటాడుతామని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజలతో కలిసి పోరాటాలు సాగిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కృష్ణగిరి మండల అధ్యక్షుడు ఆర్‌బీ వెంకట్రాముడు, ఎంపీటీసీ పుల్లగుమ్మి నాగార్జున రెడ్డి, సర్పంచ్‌లు అమకతాడు బాలు, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, గూడెంపాడు శ్రీనాథ్ రెడ్డి, రామకృష్ణాపురం సుభాష్, రాంపల్లె వెంకట్రాముడు, పోతుగల్లు శివ, బాషా, అమకతాడు మహేశ్వరరెడ్డి, కలుగొట్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. కృష్ణగిరికి చెందిన తిరుపాల్‌యాదవ్‌ను నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడంతో గురువారం పార్టీ నాయకులతో కలిసి కర్నూలులో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, నాయకులు జయరామిరెడ్డి, సుభాష్, బాలమద్దీ, రమణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చెన్నయ్య, సుదర్శనాచారి, మధు పాల్గొన్నారు.

ఘనంగా చింతలముని, నల్లారెడ్డి ఆరాధన





పూజలందుకున్న చింతలముని స్వామి, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల 35వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, కలశ స్థాపన, అభిషేకాలు, గణపతి, సుదర్శన హోమం, మహా మంగళహారతి, ప్రాతఃకాల పూజ, పంచామృతాభిషేకం, రుద్ర, నవగ్రహ హోమం, కూష్మాండ బలి, పూర్ణాహుతి, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంల సందర్భంగా గ్రామంలోని లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా మిఠాయిలు, గాజుల అంగళ్లు వెలిశాయి. ఆరాధనోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అంబేడ్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న , గోవర్ధన, ఆశోక్, ప్రభాకర్‌రెడ్డి, పెద్దయ్య, సుంకుర రామాంజనేయులు, రాజన్న, ప్రకాష్, మునిస్వామి, దస్తగిరి, వెంకటేష్, శివ, లక్ష్మన్న, సుంకన్న చిన్నాయప్ప, రంగముని, పాండు, ముని పాల్గొన్నారు.

1న పింఛన్ల పంపిణీ

తుగ్గలి : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద ఫిబ్రవరి 1వ తేదీన నియోజకవర్గంలోని 33,304 మంది పింఛన్‌దారులకు రూ.14.29కోట్లు పంపిణీ చేయనున్నారు. తుగ్గలి మండలంలో 7,548 మంది రూ.3,24,39,500, పత్తికొండలో 8,487 మందికి రూ.3,66,60000, మద్దికెరలో 4,701 మందికి రూ.1,99,98000, వెల్దుర్తిలో 7,820 మందికి రూ.3,32,68,500, కృష్ణగిరిలో 4,748 మందికి రూ.2,05,69,500 మంజూరైంది. ఈ మేరకు పింఛన్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిబ్రవరి 4వ తేదీన ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్పయాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ గురువారం తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. అలాగే మండల స్థాయి అధికారులంతా తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఈర్లదిన్నె మమత గురువారం తెలిపారు. ఉదయం 6 నుంచి 11గంటల వరకు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 54 లీటర్ల పాలతో అభిషేకం చేపడతామన్నారు. రుద్రహోమం, దుర్గాహోమం, పూర్ణాహుతి, పుష్పార్చన, కుంకుమార్చన తదితర పూజలుంటాయని, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఎస్ఐకి సన్మానం

పత్తికొండ రూరల్ : పత్తికొండ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అనంతపురానికి బదిలీపై వెళ్లిన ఎస్ఐ వెంకటేశ్వర్లుకు గురువారం స్టేషన్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. రూరల్ సీఐ పులిశేఖర్, అర్బన్ సీఐ జయన్న ఆయనను సత్కరించారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలోని చావిడిలో వెలిసిన దేవమ్మ దేవి ఆలయ నిర్మాణానికి గురువారం సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ, గ్రామపెద్దల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. కొన్నేళ్ల క్రితం ఆలయ నిర్మాణ పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిపివేశారు. దాన్ని పూర్తి చేసేందుకు గ్రామస్తులు విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన ప్రకాశమ్మ అవ్వ రూ.50 వేల నగదును సర్పంచ్‌కు అందజేశారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి: మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కంబాలపాడు, కృష్ణగిరి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి ఉదయం 7 నుంచి 10 గంటలకు వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు గమనించాలని సూచించారు.

మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: ఎక్సైజ్ పరిధిలో కల్లుగీత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుందని, ఆ కులస్తులు మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితా దేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్పరి, చిప్పగిరి మండలానికి ఒకటి చొప్పున గీత కార్మికులకు మద్యం దుకాణాలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. దరఖాస్తుదారులు తహసీల్దార్ ధృవీకరించిన.. ఈడిగ కుల ధృవీకరణ పత్రం సమర్పించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 5వ తేదీన సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా ఒకే షాపు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల–పి.కోట కొండ గ్రామాల మధ్య కర్ణాటకకు చెందిన బొలెరో వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ వంశీనాథ్ గురువారం తెలిపారు. 49 బాక్సుల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, నిందితుల వివరాలపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా చట్టప్రకారం కేసులు తప్పవని హెచ్చరించారు.

నేడు పెద్ద పుల్లయ్య ఆరాధోత్సవం

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో వెలసిన పెద్ద పుల్లయ్య 11వ ఆరాధోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గిడ్డయ్యగౌడ్ గురువారం తెలిపారు. ఉదయం పుల్లయ్య దర్గాకు గంధం సమర్పిస్తామని, మధ్యాహ్నం స్లో బైక్ పందెం ఉంటుందన్నారు. రాత్రి భజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.